క్లుప్తంగా

డీఏ పునరుద్ధరణపై వీఆర్‌ఏల హర్షం



రాష్ట్ర వీఆర్‌ఏ సంఘనాయకులను కలిసి హర్షం వ్యక్తం చేస్తున్న లోవరాజు

ఎస్.రాయవరం : గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్న తమకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి తిరిగి డీఏను పునరుద్ధరించారని ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీజీఈఈఎఫ్ వీఆర్‌ఏ నాయకులు కోరుబిల్లి లోవరాజు తెలిపారు. గతంలో వీఆర్‌ఏలకు ఇచ్చే రూ.300 రద్దు చేసిన విషయం సీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో డీఏను పునరుద్ధరిస్తూ అదనంగా రూ.200 పెంచి రూ.500 అందజేస్తున్నట్టు చెప్పారన్నారు. ఈ మేరకు వీఆర్‌ఏలంతా సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు చెప్పారు.

సీపీఎం సంతకాల సేకరణ



సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని హరిపాలెం,భోగాపురం గ్రామాల్లో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా గత నెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకూ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యల గురించి ఆరా తీశారు. సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము, బి.రామ్‌కుమార్, కర్రి అప్పారావు, కె.రామసదాశివరావు, కన్నమునాయుడు, బుద్ధ రంగారావు, కె.సోము నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర న్యాయం



హోంగార్డు భార్య హైమకు కారుణ్య నియామకపత్రాన్ని అందిస్తున్న ఎస్పీ



జిల్లా ఎస్పీ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ మురళీకృష్ణ, పోలీసు అధికారులు

అనకాపల్లి టౌన్ : సుప్రీంకోర్టు విధించిన మార్గదర్శకాలపై పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన పోలీసు అధికారులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన, గాయపడిన బాధిత కుటుంబాలకు సకాలంలో పరిహారం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఇటువంటి కేసుల విషయంలో దర్యాప్తు అధికారి మోటారు వాహన సవరణ నియమాలు 2022 ప్రకారం బాధితులకు త్వరితగతిన పరిహారం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ 48 గంటల్లో మొదటి రిపోర్ట్, 50 రోజుల్లో ఇంటరిమ్ రిపోర్ట్, 90 రోజుల్లో ఫైనల్ రిపోర్టులను క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌కు, బీమా కంపెనీకి, స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీకి కచ్చితంగా పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, అదనపు ఎస్పీ (క్రైం) పి.సత్యనారాయణరావు, పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, ఎస్‌ఐ రమణయ్య, ప్రసాద్, భీమరాజు, వెంకన్న, శ్రీ.నివాస్ పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి బాసట

జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం పెందుర్తి నియోజకవర్గం సబ్బవరం పోలీస్‌స్టేషన్‌కు చెందిన హోంగార్డు సబ్బవరపు కుమారస్వామి భార్య హైమకు దిశ హోంగార్డుగా గురువారం నియామకపత్రాన్ని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అందజేశారు. జిల్లా ఎస్పీకి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలన అధికారి బి.శారద, సీనియర్ అసిస్టెంట్ డి.భవాని పాల్గొన్నారు.

7 నుంచి నూకాంబిక ఆలయ పునర్నిర్మాణ పనులు



నూతన పాలక వర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఈవో బండారు ప్రసాద్

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి అన్ని వర్గాల ప్రజలు, కమిటీ సభ్యుల సహకారంతో ఈ నెల 7 నుంచి పనులు ప్రారంభిస్తున్నట్లు అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక ఆలయంలో నూతన కమిటీతో ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశాల మేరకు శక్తివంచన లేకుండా అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు దేశ, విదేశాల నుంచి భక్తులు తరలివస్తున్నారని, వారికి ఎటువంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజుల్లో ప్రత్యేక అలంకరణ, నిత్యాన్నదాన భక్తులకు కావల్సిన మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంటపల్లి శోభారాణి, పీలా లక్ష్మి, పాము అనురాధ, మల్లవరపు ఈశ్వరరావు, ఆడారి ఉమాచంద్రమహేశ్వరి, బుద్ధ నరసింగరావు, గొల్లవిల్లి నరసింగరావు, కొండూరు రవీంద్రనాథ్, ఎక్స్ అఫీషియో మెంబర్ వై.శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ సంగీత నాటకోత్సవాలు

మద్దిలపాలెం: జాతీయ సంగీత నాటకోత్సవాలు శనివారం నుంచి మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్యనారాయరాజు, డాక్టర్ వీఆర్‌కే ప్రసాద్ తెలిపారు. గురువారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగీత నాటకోత్సవాలను ఈనెల 7వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు అపర త్యాగరాజు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామికి నాద విద్యాభారతి పురస్కారం అందిస్తున్నట్టు ప్రకటించారు. జాతీయ పురస్కారంతో పాటు రూ.లక్ష బహుమతి అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్.ఎం.వెంకయ్యనాయుడు, నావికాదళ వైస్ అడ్మిరల్ జి.శ్రీనివాస్‌లు హాజరవుతారని తెలిపారు.

జగనన్న పాలవెల్లువ రుణాల పంపిణీ

మునగపాక : అమూల్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఒంపోలు సచివాలయ కన్వీనర్ నరాలశెట్టి సూర్యనారాయణ కోరారు. ఒంపోలులో గురువారం అమూల్ పాడిరైతులతో సమావేశం నిర్వహించి అర్హులైన మహిళలకు పాడి పశువుల కొనుగోలుకు రుణాలు అందజేశారు. జగనన్న పాలవెల్లువ ద్వారా తక్కువ వడ్డీకి రుణం అందజేస్తారన్నారు. సర్పంచ్ సూరిబాబు, పశు సంవర్థక శాఖ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ శిబిరం



కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిబిరం

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ ఐజీసీ ఎస్ఎస్‌సీ-23 క్యాంప్‌లో భాగంగా గురువారం టెంట్ ఫిచింగ్ పోటీలు నిర్వహించారు. ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఏపీ, తెలంగాణకు చెందిన 300 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. క్యాంప్ కమాండెంట్ ఇంగ్లీసర్ పర్యవేక్షణలో ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కమాండర్ వి.ఎం.రెడ్డి క్యాడెట్లు వేసే టెంట్ల తీరుని పరిశీలించారు. ఈ క్యాంప్‌లో ప్రతిభ కనబరిచిన వారిని నౌసేనా, రిపబ్లిక్ డే పెరేడ్‌లకు ఎంపిక చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఎన్‌సీసీ అధికారులు అరవింద్, తులసి, నాగేశ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

250 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో గురువారం నిర్వహించిన మదర్ మెమోరియల్ మెగా హెల్త్ క్యాంపునకు 250మంది రోగులు హాజరయ్యారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆళ్ల అప్పలరాజు భార్య వరలక్ష్మి ద్వితీయ వర్ధంతిలో భాగంగా ఆళ్ల శ్రీనివాసరావు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి జిల్లా ఆరోగ్య శాఖ వైద్యాధికారి ఎ.హేమంత్ హాజరై రోగులకు సూచనలు చేశారు. చిన్న పిల్లల వైద్య నిపుణుడు నవీన్ కోలాట్, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఆళ్ల వసంత, వైద్యులు సాయి, ప్రవీణ్ , వెంకటేశ్వర స్కూల్ ఆఫ్ నర్సింగ్ స్టాఫ్ వైద్య సేవలందించారు.

కల్వర్టుల నిర్మాణం ప్రారంభం



కె.వెంకటాపురంలో కల్వర్టు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న శ్రీరామ్మూర్తి

కోటవురట్ల : కె.వెంకటాపురంలోని రెండు వార్డుల్లో కల్వర్టుల నిర్మాణం గురువారం ప్రారంభించారు. ఎంపీటీసీ కాళ్ల రత్నం మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని 2, 4 వార్డుల్లో కాలువలపై కల్వర్టు లేకపోవడంతో చాలా కాలంగా స్థానికులు ఇబ్బంది పడేవారన్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో రెండు కల్వర్టులకు ఎంపీటీసీ నిధులు రూ.4 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

మునగపాక : చూచుకొండ శివారులో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. పేకాట శిబిరంపై అందిన ఫిర్యాదు మేరకు గురువారం సిబ్బందితో కలిసి దాడి జరపగా, పేకాడుతూ ఆరుగురు పట్టుబడ్డారని, వారి వద్ద నుంచి రూ.12వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ అలీ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట : పట్టణంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పట్టణంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా చినపీర్లపంజా, కరణంగారి వీధి, పెద్ద, చిన తమ్మయ్యగారి వీధులు, చైతన్య స్కూల్, లావణ్య వాటర్ ప్లాంట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంటింటి కుళాయి పనులు ప్రారంభం



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ చిలుకు

రాంబిల్లి: ఇంటింటి కుళాయిలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని దిమిలి సర్పంచ్ బంగారు చిలుకు అన్నారు. గురువారం ఇంటింటి కుళాయి పనులకు సంబంధించి ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

అచ్యుతాపురం(అనకాపల్లి): విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడరాదని యలమంచిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ జె.జనార్దరావు అన్నారు. అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో డ్రగ్ వ్యతిరేక అవగాహన సదస్సును నిర్వహించారు. జనార్దనరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ వాడకం వల్ల ప్రజలకు కలిగే అనర్థాలపై అందరిలో అవగాహన కలిగేలా ప్రచారం చేయాలని సూచించారు.

సీనియర్ వైద్యుల పోస్టుల భర్తీకి 8న ఇంటర్వ్యూలు

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలో సీనియర్ రెసిడెంట్స్ వైద్యులు (పీడ్రియాట్రిక్స్) పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 8న ఆంధ్ర వైద్య కళాశాల్లో ఉదయం 11 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. కార్యక్రమానికి అభ్యర్థులు దరఖాస్తుతోపాటు హాజరు కావచ్చని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలన్నీ https://www.amc.edu.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు 9848314843 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

రెండో యూనిట్‌లో విద్యుదుత్పత్తి పునరుద్ధరణకు సన్నాహాలు

పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీ రెండో యూనిట్‌లో సాంకేతిక కారణాల వల్ల ఇటీవల నిలిచిపోయిన విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సంస్థలోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్ బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం ఏర్పడడంతో మంగళవారం రాత్రి విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. యూనిట్‌లో సంభవించిన సాంకేతిక సమస్యను సరిచేయడానికి నిపుణులు రంగంలోకి దిగారు. ఈ మరమ్మతులు పూర్తయితే గురువారం రాత్రికి లేదా శుక్రవారం ఉదయానికల్లా రెండో యూనిట్ నుంచి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 1, 3, 4 యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని అధికారులు వెల్లడించారు.

రైతుల సహకారంతోనే అభివృద్ధి



ఉత్తమ రైతు భాస్కరరావును సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : సహకార సంఘ అభివృద్ధికి రైతులు సహకరించాలని నాగులాపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ మళ్ల ఉమామహేశ్వరరావు కోరారు. నాగులాపల్లి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం గురువారం సాయంత్రం సంఘ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సంఘం ప్రస్తుతం రూ.21లక్షల మేర నికర లాభం సాధించిందన్నారు. అలాగే రూ.36 కోట్ల మేర సంఘం ద్వారా లావాదేవీలు జరిగాయన్నారు. అనంతరం సీనియర్ రైతులను సత్కరించారు. సీఈవో మళ్ల స్వామి సంఘం నివేదికను చదివి వినిపించారు. పాలకవర్గ సభ్యులు నరాలశెట్టి బాబూరావు, కొయిలాడ ఎర్రయ్యనాయుడు, రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడి



పొలంబడిలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో

యలమంచిలి : విత్తన శుద్ధి, నారుమడులు చిగుర్లు తుంచుట పద్ధతి ద్వారా వరినాట్లు ప్రక్రియ చేపడితే వ్యవసాయంలో అధిక దిగుబడులు రైతులు సాధించగలుగుతారని యలమంచిలి మండల వ్యవసాయాధికారి మోహనరావు అన్నారు. గురువారం ఆయన యలమంచిలి మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లి గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు వరినాట్లు విత్తుపై అవగాహన కల్పించారు. వరిలో సంప్రదాయ యాజమాన్య పద్ధతులు పాటించాలని, రైతులు అందరూ వరి నాట్లు వేసే వరకు పంట నమోదు ప్రక్రియ జరగుతుందని తెలిపారు. వరి నాట్లు ఏవిధంగా వేయాలి, కలుపు నివారణ, ఎరువుల వినియోగంపై సలహాలు అందించారు. కార్యక్రమంలో పకీరనాయుడు, వెంకటరమణ, వ్యవసాయ సహాయకులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు ఆహ్వానం

కోటవురట్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.కొండబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎంపీహెచ్‌డబ్ల్యు(ఎఫ్), జీఎఫ్‌సీ పోస్టులకు సంబంధించి ఒక్కొక్కటి ఖాళీ ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేయాలని సూచించారు. ఎంపీహెచ్‌డబ్ల్యు(ఎఫ్) పోస్టుకు బీఎస్సీ నర్సింగ్, జీఎఫ్‌సీ పోస్టుకు ఎంఏ ఎకనమిక్స్, ఎంఏ రూరల్ డెవలప్‌మెంట్ సబ్జెక్టుల్లో 50 శాతం పైబడి మార్కులు పొందిన వారు అర్హులుగా తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ అర్హత ధ్రువపత్రాలతో ఆగస్టు 4వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు గౌరవ వేతనంగా రూ.10 వేలు అందిస్తారని తెలిపారు.

రాంబిల్లి: లాలంకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుడు పోస్టు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ నాయుడు తెలిపారు. ఎంఎస్సీ కెమిస్ట్రీ చదివి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు సెప్టెంబరు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నెలకు రూ.10వేలు వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

హిందీ ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవో-2 శివనాయుడు

మునగపాక: విద్యార్థులకు హిందీ భాష పట్ల మక్కువ కలిగేలా చూడాలని ఎంఈవో-2 శివనాయుడు కోరారు. తిమ్మరాజుపేట స్కూల్ కాంప్లెక్స్‌లో గురువారం హిందీ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ మాట్లాడడం, రాయడంపై మరింత అవగాహన పెంచాలన్నారు. శిక్షణకు రీసోర్స్ పర్సన్లుగా శైలజ, రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు, అరుణ జ్యోతి వ్యవహరించారు. కాంప్లెక్స్ కో-ఆర్డినేటర్లు కర్రి లక్ష్మినారాయణ, మద్దాల గోవింద, నూకేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుల పంపిణీ



రేషన్ కార్డులు అందజేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

ఎస్.రాయవరం : ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ అన్నారు. గ్రామంలో నూతనంగా మంజూరైన 12 రేషన్ కార్డులు లబ్ధిదారులకు సచివాలయంలో గురువారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వియ్యపు సింహాద్రి, బొండా దివాణం, వీఆర్వో నూకరాజు, పంచాయితీ కార్యదర్శి రామిరెడ్డి పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల నిరసన

కోటవురట్ల : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు గురువారం ఆందోళన నిర్వహించారు. దస్తావేజు లేఖర్లు రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు పెన్‌డౌన్ కార్యక్రమంతో నిరసన తెలుపుతున్నట్టు యూనియన్ ప్రెసిడెంట్ లాలం గోవిందు తెలిపారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ప్రైమ్ 2.0 పద్ధతిని, సచివాలయాలకు రిజిస్ట్రేషన్‌లు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు.

వెల్లివిరిసిన రక్షానుబంధం...

నక్కపల్లి / పాయకరావుపేట/ కోటవురట్ల / ఎస్.రాయవరం / యలమంచిలి / రాంబిల్లి / మునగపాక : అన్నా నీ అనురాగం ఎన్నో జన్మలపుణ్యఫలం అంటూ అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీ కట్టి రక్షాబంధన్ పండుగను గురువారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. స్త్రీ శక్తిస్వరూపిణి. ఇంటి ఆడపడుచు తన క్షేమాన్ని కోరుతూ కట్టే తోరణమే రక్షా బంధనం. ప్రతి ఏటా శ్రావణపౌర్ణమినాడు అక్కాచెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీ కడతారు. తమ క్షేమం కోరుకుంటున్న తోబుట్టువులకు కష్టాల్లో అండగా నిలుస్తామని ఈ సందర్భంగా అన్నదమ్ములు ప్రమాణం చేస్తారు. శ్రావణ పౌర్ణమి(జంధ్యాలపౌర్ణమి) కావడంతో పలువురు నూతన యజ్ఞోపవేతాన్ని ధరించారు. ఇదేరోజున శ్రీమన్నారాయణుడు హయగ్రీవునిగా అవతరించాడు కాబట్టి ఈరోజు హయగ్రీవుడ్ని కూడా పూజించారు. రక్షాబంధనం కట్టేందుకు వచ్చిన సోదరీమణులతో ఇళ్లన్నీ కళకళలాడాయి. నక్కపల్లిలో


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు రాఖీ కడుతున్న మహిళా నేత పద్మ

ఎమ్మెల్యే గొల్లబాబూరావుకు, ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణకు జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ వెదుళ్లపాలెం సర్పంచ్ వెదుళ్ల వరలక్ష్మి రాఖీ కట్టారు. మునగపాక మండలంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు ఆ పార్టీ మహిళా నేత పద్మ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.


నక్కపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వీసంకు రాఖీ కడుతున్న జెడ్పీటీసీ కాసులమ్మ తదితరులు


కోటవురట్లలో...


పాయకరావుపేటలో చిన్నారుల రాఖీ సంబరం


రాంబిల్లిలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ..


ఎస్.రాయవరంలో..


నక్కపల్లిలో...

9 ఏళ్ల తరువాత..

తోడపెద్దు ఉత్సవం



మునగపాకలో పాలుకొలుపు నిర్వహించే ఆలయ మండపం (ఇన్‌సెట్) తోడపెద్దు

- మునగపాకలో నేడు, రేపు వేడుకలు
- జిల్లా వ్యాప్తంగా 17 ప్రాంతాల నుంచి తోడపెద్దులతో పాటు సేవగరిడీల రాక

మునగపాక : మండల కేంద్రంలో ఈనెల 1,2 తేదీల్లో యర్ర వెంకయ్య తోడపెద్దు పాలుకొలుపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొమ్మిదేళ్ల తరువాత మునగపాకలో తోడపెద్దుకు పాలుకొలుపు నిర్వహించనున్నారు. మునగపాకలో పేరుగాంచిన యర్ర వెంకయ్య తోడపెద్దు పాలు కొలుపు కార్యక్రమం రెండు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు. శుక్రవారం సాయంత్రం 7 గంటల తరువాత పట్టాభి దాసుడు నమ్మి వరప్రసాద్ పర్యవేక్షణలో పాలు కొలుపు ఉత్సవం ప్రారంభమవుతుంది. 2వ తేదీన ఉదయం 5.29 గంటలకు తిరు పాలుకొలుపు వేడుక జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 17 సింహాద్రప్పన్న ఎద్దులతో పాటు సేవగరిడీలు రానున్నాయని నిర్వాహకులు తెలిపారు. 2వ తేదీన భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.